సాక్షి నంద్యాల

సోమవారం । 30 । జనవరి । 2023



అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రంలో వెలిసిన భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. పూజల్లో ఈఓ ఎస్ లవన్న, అర్చకులు పాల్గొన్నారు.



అహోబిలేశుడు వచ్చెను!

రుద్రవరం: తన పెళ్లికి భక్తులను ఆహ్వానించేందుకు అహోబిలేశుడు పార్వేటగా ఆదివారం నల్లవాగుపల్లెకు చేరుకున్నారు. స్వామి రాకతో ఊరంతా పండుగ వాతావరణం నెలకొంది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,617.04
టీఎంసీల సామర్థ్యం	: 105,788
ప్రస్తుతం	: 53,416
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 8,346

న్యూస్‌రీల్

నేడు స్పందన కార్యక్రమం

నంద్యాల(అర్బన్): స్థానిక వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే స్పందన కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ హాజరు కావాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, నియోజకవర్గ, మండల స్థాయిల్లో కూడా యథాతథంగా స్పందన కార్యక్రమం ఉటుందన్నారు.

జిల్లాలో మూడు ఏపీ టూరిజం పోలీస్ కేంద్రాలు



శివరాత్రి బ్రహ్మోత్సవ ఏర్పాట్లును పరిశీలిస్తున్న డీఎస్పీ మహేశ్వరరెడ్డి

మహానంది: జిల్లాలో శ్రీశైలం, మహానంది, అహోబిలం పుణ్యక్షేత్రాల్లో ఏపీ టూరిజం పోలీస్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు నంద్యాల డీఎస్పీ మహేశ్వరరెడ్డి తెలిపారు. మహానంది ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, రూరల్ సీఐ రవీంద్ర, ఏఈఓ వై.మధు, ఎస్ఐ సీసీ నాగార్జునరెడ్డితో కలిసి ఆదివారం ఆయన మహానందిలో శివరాత్రి బ్రహ్మోత్సవ ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ టూరిజం పోలీసు కేంద్రాల ఏర్పాటుతో ఆయా క్షేత్రాల భక్తులకు పోలీసులు 24 గంటలూ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ ఏడాది దేవస్థానం స్థలంలో పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేస్తున్నామని, టూ వీలర్లు, ఫోర్ వీలర్లతో పాటు బస్సులకు ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలను కేటాయిస్తామని చెప్పారు. ఉత్సవాల సమయంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా ప్రణాళిక రూపొందిస్తామన్నారు.

ఈ క్రాప్ నమోదు 80 శాతం పూర్తి

- డీఏఓ మోహన్‌రావు



మొక్కజొన్న పంట ఈ క్రాప్ నమోదు పరిశీలిస్తున్న డీఏఓ మోహన్‌రావు

ఉయ్యాలవాడ: జిల్లాలో ఇప్పటి వరకు 80 శాతం ఈ క్రాప్ నమోదు పూర్తయినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రావు తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని కొండుపల్లె, ఉయ్యాలవాడ, అల్లూరు ఆర్‌బీకే కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే శనగ, మొక్కజొన్న పంటల్లో ఈ క్రాప్ నమోదును మండల వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్, సిబ్బందితో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 20వ తేదీలోగా అన్ని పంటలను ఈ క్రాప్ నమోదు వంద శాతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో రబీ సీజన్‌లో ప్రధాన పంటగా పప్పు శనగ 60,118 హెక్టార్లలో సాగు కాగా, జొన్న 23,170, మొక్కజొన్న 8,610, మినుము 19,009, పెసర 379, కంది 664, వేరుశనగ 2311, ఇతర పంటలు 25,739 హెక్టార్లలో రైతులు సాగు చేశారన్నారు. పంటల సాగుకు అనుగుణంగా అవసరమైన యూరియా, డీఏపీ, ఎంఏపీ, ఎస్ఎస్‌పీతో పాటు అన్ని రకాల కాంప్లెక్స్ ఎరువులు ఈ నెలలో 64,580 మెట్రిక్ టన్నులు జిల్లాలో అందుబాటులో ఉంచామన్నారు.

ఇంటిపోరు.. సీటు తకరారు!

అన్నా చెల్లెలు మధ్య కయ్యం





ఈనెల 8న భూమా నాగిరెడ్డి జయంతి సందర్భంగా బ్రహ్మానందరెడ్డి రక్తదానం, అన్నదానాన్ని తన నివాసం వద్ద చేపట్టారు. అలాగే అఖిలప్రియ మరో ప్రాంతంలో రక్తదానం, అన్నదానం నిర్వహించారు. ఇద్దరూ ఒకరి కార్యక్రమాలకు ఒకరు హాజరు కాలేదు. దీన్నిబట్టి ఇరు వర్గాల మధ్య వైరం ఏస్థాయిలో ఉందో అర్థమవుతోంది.



▌ చంద్రబాబు ప్రకటించిన అభ్యర్థిపైనే తిరుగుబాటు

నువ్వేంది మాకు చెప్పేది అచ్చెన్నా..



'మీ అన్న ఎర్రన్నాయుడికి టిక్కెట్ ఇప్పించింది మా అన్న కేఈ కృష్ణమూర్తి! నువ్వేంటి మాకు చెప్పేది. మీ ఇంట్లో నువ్వు.. మీ అన్న కుమారుడు, కూతురు.. ముగ్గురికి టిక్కెట్లు కావాలి. మేము మీరు చెప్పినట్లు వినాలా?''

– అచ్చెన్నాయుడుతో మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ ఫోన్ సంభాషణగా టీడీపీ వర్గాల్లో చర్చ

తమ్ముళ్ల తలోదారి

- భూమా కుటుంబంలో మింగుడుపడని అఖల
- అన్న బ్రహ్మానందరెడ్డితో విభేదాలు
- ఒక్కొక్కరుగా దూరమైన కుటుంబ సభ్యులు
- ఆళ్లగడ్డలో కిశోర్, నంద్యాల ఫిరోజ్ పోటీకి యత్నాలు
- డోన్‌లో పోటీ చేసి తీరుతామంటున్న కేఈ ప్రభాకర్

భూమా కుటుంబంలో విభేదాలు.. డోన్‌లో కేఈ తిరుగుబాటు.. టీడీపీలోని తాజా స్థితికి అద్దం పడుతోంది. పార్టీ అధినేతలు పర్యటిస్తే.. ఆ తర్వాత స్థానిక నేతల్లో సఖ్యత పెరుగుతుందనే భావన ఇప్పటి వరకుంది. అలాంటిది చంద్రబాబు జిల్లాకు వచ్చి వెళ్లిన తర్వాత ఆ పార్టీ నేతల తీరు పార్టీ పరువును బజారున పడేస్తుంది. డోన్‌లో పోటీకి ఓ అభ్యర్థి పేరును పార్టీ అధినేత ప్రకటించగా.. కేఈ ప్రభాకర్ తాను తప్పక పోటీ చేస్తానని తన మనసులోని మాట బయటపెట్టారు. ఇక అఖిలప్రియ వ్యవహార శైలి భూమా కుటుంబంలో అగ్గిరాజేసింది. ఒక్కొక్కరుగా ఆమెకు దూరం కాగా.. పార్టీ బలహీనపడింది. అసలే అంతంత మాత్రంగా ఉన్న టీడీపీ.. నేతల కుమ్ములాటలు, విభేదాల నేపథ్యంలో 2019 ఎన్నికల ఫలితాలే పునరావృతం కాక తప్పదనే అభిప్రాయం ఆ పార్టీ వర్గీయుల్లోనే వ్యక్తమవుతోంది.

సాక్షి ప్రతినిధి కర్నూలు: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన తర్వాత ఆ పార్టీ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రాష్ట్ర, జాతీయ అధ్యక్షులనే సవాల్ చేయడం చూస్తే తమ్ముళ్ల తిరుగుబాటు ధోరణి అర్థమవుతోంది. కర్నూలు పర్యటనలో చంద్రబాబు డోన్ అభ్యర్థిగా ధర్మవరం సుబ్బారెడ్డిని ప్రకటించారు. ఆ తర్వాత ఎమ్మెల్సీ కేఈ ప్రభాకర్ డోన్‌లో తన జన్మదిన వేడుకల సందర్భంగా చంద్రబాబు నిర్ణయంపై ధిక్కారస్వరం వినిపించారు. 'వార్డు మెంబర్‌గా కూడా గెలవని వారు, జనామోదం లేని వాళ్లు రాజకీయాల్లోకి వచ్చారని.. ఎవరెన్ని చెప్పినా కేఈ కుటుంబం 2024 ఎన్నికల్లో పోటీ చేసి తీరుతుందని ప్రకటించారు. తనకు వయస్సు మీద పడి ఉండొచ్చని.. ఆర్థిక, అంగ బలం ఉందనే విషయం ఎవ్వరూ మరవొద్దని చెప్పుకొచ్చారు. అంటే.. ఎన్నికల్లో సీటు ఇవ్వకపోతే స్వతంత్ర అభ్యర్థిగా లేదా మరో పార్టీ నుంచైనా బరిలో నిలుస్తామని చెప్పకనే చెప్పారు. ఇందులో భాగంగా కేఈ ప్రభాకర్ డోన్‌లో కార్యకర్తలను కలిసేందుకు ఏర్పాట్లు చేసుకోగా.. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సోమిశెట్టి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. 'పార్టీ మీకు చాలా చేసిందని, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు వద్దని, ఏమైనా ఉంటే కూర్చొని మాట్లాడుకుందాం' అని ఏకంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుతో ఫోన్ చేయించారు. అందుకే కేఈ గట్టిగానే బదులివ్వడంతో అచ్చెన్న ఫోన్ పెట్టేయడం, సోమిశెట్టి మౌనం వహించడం జరిగినట్లు టీడీపీ నేతల్లో చర్చ జరుగుతోంది.

తెరవెనుక బీసీ రాజకీయం

భూమా కుటుంబంలోని విభేదాలు, కుటుంబానికి ఒకే టిక్కెట్ అనే పాలసీని పార్టీ తీసుకోవడంతో మైనార్టీ కోటాలో తన కుమారుడు ఫిరోజ్‌కు టిక్కెట్ దక్కించుకునేందుకు ఫరూక్ పావులు కదుపుతున్నారు. వీరికి మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి గట్టిగా మద్దతు ఇస్తున్నట్లు తెలుస్తోంది. కేఈ, భూమా కుటుంబాలు బలహీనమైతే టీడీపీలో తాను బలమైన నేతగా ఎదగొచ్చనే యోచనతో డోన్, నంద్యాల, ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల్లో తన అనుకూలురకు టిక్కెట్లు ఇప్పించుకునే ప్రయత్నం బీసీ చేస్తున్నట్లు చర్చ జరుగుతోంది.

'భూమా' కుటుంబంలో తారస్థాయికి విభేదాలు

భూమా నాగిరెడ్డి మరణంతో నంద్యాల ఎమ్మెల్యేగా భూమా బ్రహ్మానందరెడ్డి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. 2019లో శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి చేతిలో ఓడిపోయారు. ఆ తర్వాత జరిగిన పరిణామాలతో అఖిల, బ్రహ్మం మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. బ్రహ్మంకి వ్యతిరేకంగా ఆళ్లగడ్డలో పార్టీ కార్యాలయాన్ని అఖిల ప్రారంభించి, అక్కడ కార్యకర్తలకు తన తమ్ముడు జగత్ విఖ్యాత్ అందుబాటులో ఉంటారని చెప్పింది. ఈ కార్యక్రమానికి బ్రహ్మం గైర్హాజరయ్యారు. దీనికి తోడు నాగిరెడ్డి మృతి తర్వాత కుటుంబంలో జరిగిన పరిణామాల నేపథ్యంలో అఖిలను కుటుంబ సభ్యులంతా విభేదించి దూరమయ్యారు. ఇకపోతే కేసులు, ఇతర వ్యవహారాలు.. రాజకీయంగా చురుగ్గా లేకపోవడంతో నియోజకవర్గంలో పార్టీ బలహీనపడింది. ఈ నేపథ్యంలో ఆళ్లగడ్డలో అఖిలకు ప్రత్యామ్నాయంగా కిషోర్‌రెడ్డిని కూడా టీడీపీ అధిష్టానం పరిశీలిస్తోంది. కుటుంబసభ్యులు కూడా అతనికే మద్దతుగా నిలుస్తున్నట్లు తెలుస్తోంది.

ఒక్కొక్కరుగా దూరమవుతూ..

- ఓ క్రషర్ విషయంలో సమీప బంధువు శివరామిరెడ్డి దూరం కావడంతో పాటు పరస్పరం కేసులు నమోదు చేసుకున్నారు.
- నాగిరెడ్డి చిన్నాన్న, విజయ డెయిరీ చైర్మన్‌గా కొనసాగిన భూమా నారాయణరెడ్డిని ఆ కుర్చీ నుంచి తప్పించే ప్రయత్నం చేయడంతో ఆయనా మౌనం దాల్చారు.
- అఖిల పెద్దనాన్న భాస్కర్‌రెడ్డి కుమారుడు భూమా కిషోర్‌రెడ్డితోనే విభేదాలు తలెత్తడంతో అతనూ బీజేపీలో చేరారు.
- నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి సోదరుడు మహేశ్ కూడా బీజేపీ కండువా కప్పుకున్నారు.
- భూమా నాగిరెడ్డికి ఆత్మగా మెలిగిన ఏవీ సుబ్బారెడ్డితోనూ వైరం.

నేడు 'జగనన్న చేదోడు'

- ఉమ్మడి జిల్లాలో 26,392 మంది లబ్ధిదారులకు రూ.26.39 కోట్లు

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి అమలు చేస్తున్న జగనన్న చేదోడు పథకం కింద వృత్తి పనులు చేసుకుంటు జీవనం గడుపుతున్న నాయీబ్రాహ్మణులు, రజకులు, టైలర్లకు సోమవారం ఆర్థిక సహకారం అందనుంది. ఇందుకు సంబంధించి స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు జిల్లా బీసీ కార్పొరేషన్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పథకం కింద ఒక్కో లబ్ధిదారునికి రూ.10 వేలు విడుదల కానున్నాయి. ఇప్పటి వరకు అర్హులైన లబ్ధిదారులకు రెండు పర్యాయాలు ఆర్థిక సహకారం అందించిన రాష్ట్ర ప్రభుత్వం 2022– 23వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మూడో పర్యాయం కూడా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనుంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 26,392 మంది లబ్ధిదారుల ఖాతాల్లోకి రూ.26,39,20,000 జమ కానుంది. కర్నూలు జిల్లాలో 2,662 మంది నాయీ బ్రాహ్మణులకు రూ.2,66,20,000, అలాగే 3,656 మంది రజకులకు రూ.3,65,60,000, టైలర్లు 6,538 మందికి రూ.6,53,80,000 విడుదల చేస్తున్నారు. అలాగే నంద్యాల జిల్లాకు సంబంధించి 1,897 మంది నాయీ బ్రాహ్మణులకు రూ.1,89,70,000, రజకులు 7,640 మందికి రూ.7,64,00,000, టైలర్లు 3,999 మందికి రూ.3,99,90,000 విడుదల కానుంది.

రెండు విడతల్లో రూ.47.24 కోట్లు విడుదల ...

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇప్పటి వరకు రెండు విడతల్లో (2020 మే 10, 2022 ఫిబ్రవరి 8న) మొత్తం 47,241 మంది లబ్ధిదారులకు రూ.47.24 కోట్లు విడుదలయ్యాయి. కర్నూలు జిల్లా మొదటి విడతలో 12,191 మంది లబ్ధిదారులకు రూ.12.191 కోట్లు, రెండో విడతలో 11,222 మంది లబ్ధిదారులకు రూ.11.22 కోట్లు విడుదలయ్యాయి. అలాగే నంద్యాల జిల్లాలో మొదటి విడతలో 12,349 మంది లబ్ధిదారులకు 12.34 కోట్లు, రెండవ విడతలో 11479 మంది లబ్ధిదారులకు రూ.11.47 కోట్లు విడుదలయ్యాయి.

అన్నదాన పథకానికి రూ. 4 లక్షల విరాళాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి వేర్వేరు ప్రాంతాలకు చెందిన దాతలు మొత్తం రూ. 4 లక్షల మేర విరాళాలు అందజేశారు. ఆదివారం ఢిల్లీకి చెందిన యోగేంద్ర కుమార్ మోడీ రూ.లక్ష, ప్రకాశం జిల్లాకు చెందిన రవిశంకరరెడ్డి రూ.1,01,100లు, మహారాష్ట్ర, సావంత్‌పూర్‌కు చెందిన శివాజ ఆనంద రూ.2,02,232 విరాళంగా అందజేశారు. ఈ మేరకు అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో విరాళానికి సంబంధించిన చెక్కులను ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం దాతలకు విరాళాల బాండ్‌తో పాటు స్వామి అమ్మవార్ల శేషవస్త్రాలు, లడ్డూ ప్రసాదాలను అందజేశారు.



ఆలయ అధికారికి విరాళం అందజేస్తున్న మహారాష్ట్రకు చెందిన శివాజ ఆనంద

వాల్మీకుల ఎస్టీ అంశంపై కదలిక



చనుగొండ్ల గ్రామంలో పర్యటిస్తున్న వన్‌మ్యాన్ కమిషన్ చైర్మన్ శ్యామ్యూల్ ఆనంద్‌కుమార్, ఎంపీ తలారిరంగయ్య



సిద్ధినగట్టు గ్రామంలో వాల్మీకుల స్థితిగతులు తెలుసుకుంటున్న వన్‌మ్యాన్ కమిషన్ చైర్మన్ శ్యామ్యూల్ ఆనంద్‌కుమార్

- వివిధ గ్రామాల్లో పర్యటించిన ఏకసభ్య కమిషన్
- నేడు మధ్యాహ్నం 2 గంటలకు జెడ్పీలో ఓపెన్ ఫోరం

కర్నూలు(అర్బన్)/డోన్ రూరల్/ వెల్దుర్తి: వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో పునరుద్ధరించాలనే అంశంపై కదలిక ప్రారంభమైంది. వాల్మీకుల చిరకాల కోరికను తీర్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రిటైర్డు ఐఏఎస్ అధికారి శ్యామ్యూల్ ఆనంద్ కుమార్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను నియమించారు. ఇప్పటికే ఈ కమిషన్ ప్రతినిధులు (యూనివర్సిటీ విద్యార్థులు) రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోని గ్రామాల్లో పర్యటించి వాల్మీకుల ఆచార వ్యవహారాలు, స్థితిగతులపై అధ్యయనం చేస్తున్నారు. గత వారంలో జిల్లాలోని ఆలూరు, హొళగుంద మండలాల్లోని పలు గ్రామాలను కమిషన్ ప్రతినిధులు పర్యటించి ప్రజలతో మాట్లాడి అనేక విషయాలను నమోదు చేసుకున్నారు. ఆదివారం ఏకసభ్య కమిషన్ శ్యామ్యూల్ ఆనంద్‌కుమార్ ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్యాపిలి మండలం బోయవాండ్లపల్లె, మాన్‌దొడ్డి, డోన్ మండలం చనుగొండ్ల, కర్నూలు జిల్లాలోని వెల్దుర్తి మండలం సిద్ధనగట్టు, పిక్కిలివాండ్లపల్లి గ్రామాల్లో పర్యటించి వాల్మీకి, బోయల ఆచార వ్యవహారాలు, కులంలో ఉన్న గోత్రాలు, భుజించే ఆహారం, పూజించే దేవతలు, వ్యవసాయం, భూముల వివరాలు, వేస్తున్న పంటలు, భూమి లేని వారి జీవనోపాధి తదితర అనేక విషయాలను అడిగి తెలుసుకున్నారు.''ఆర్థికంగా చాలా వెనకబడి ఉన్నాం సార్... గ్రామాల్లో మాకు ఎటువంటి ఆధారం లేక చాలా ఇబ్బంది పడుతున్నాం. కుటుంబం పోషణ భారంగా మారింది. మమ్మల్ని ఎస్టీల్లోకి చేర్చి న్యాయం చేయండి'' అంటూ ఆయా గ్రామస్తులు విన్నవించారు. అందరి సమస్యలు అధ్యయనం చేసిన అనంతరం ప్రభుత్వానికి నివేదిస్తామని కమిషన్ చైర్మన్ తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో అనంతపురం జిల్లా ఎంపీ తలారి రంగయ్య, రాష్ట్ర వాల్మీకి, బోయ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బీ మధుసూదన్, జిల్లా ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖలకు చెందిన అధికారులు ఎస్ శ్రీనివాసకుమార్, పీ వెంకటలక్షుమ్మ , కర్నూలు ఆర్‌డీఓ హరిప్రసాద్, ఆయా మండలాల తహసీల్దార్లు, వివిధ శాఖలకు చెందిన అధికారులు ఉన్నారు.

నేడు జెడ్పీలో ఓపెన్ ఫోరం

వాల్మీకులను ఎస్టీ జాబితాలో పునరుద్ధరించే విషయమై అభిప్రాయాల సేకరణకు సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం వరకు కర్నూలులో జెడ్పీ కార్యాలయంలో ఓపెన్ ఫోరం నిర్వహించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ శ్యామ్యూల్ ఆనంద్‌కుమార్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. జిల్లాలోని వాల్మీకి, బోయలు తమ అభిప్రాయాలను తెలియజేయాలని జిల్లా కలెక్టర్ పీ కోటేశ్వరరావు కోరారు.

అడవిలో ఉడ్స్ దొర అడుగులు



నాగలూటి సమీపంలోని టేక్ ప్లాంటేషన్ వద్ద హెచ్ఎఫ్ఏ ఉడ్స్ జీవిత చరిత్ర ఫలకం

స్వాతంత్ర్యానికి పూర్వం దేశాన్ని దోచుకున్న తెల్లదొరలు ఎంతో మంది ఉన్నా వారికి భిన్నంగా కొందరు ప్రజల మనస్సును దోచుకున్నారు. కష్టాల్లో ఉన్న పేదలకు అండగా నిలిచి తమదైన ముద్ర వేసుకున్నారు. వారిలో సర్ ఆర్థర్ కాటన్ దొర.. సర్ థామస్ మన్రో దొర.. హ్యూగో ఫ్రాన్సిస్ అండ్రూ ఉడ్ దొర.. ఇలా కొందరు ఉన్నారు. మొదటి ఇద్దరు వ్యక్తులు అందరికీ తెలిసే ఉంటుంది. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి జీవం పోసి బీడు భూములను సస్యశ్యామలం చేసిన కాటన్ దొర ఒకరు కాగా.. రాయలసీమ ప్రాంతంలో పాలెగాళ్ల వ్యవస్థను రద్దు చేసి, పేదలకు భూములు పంపిణీ చేసి మహోన్నతుడు థామస్ మన్రో దొర మరొకరు. అలాగే విధి నిర్వహణలో ఉత్తమ సేవలందిన హ్యూగో ఫ్రాన్సిస్ అండ్రూ ఉడ్ దొర కూడా నల్లమలపై పచ్చని సంతకం చేశారు.

- నల్లమల సంరక్షణకు బ్రిటీష్ అధికారి కృషి
- అగ్ని ప్రమాదాలు అరికట్టేందుకు ఫైర్‌లైన్లకు శ్రీకారం
- టేకును పరిచయం చేసినది ఆయనే

ఆత్మకూరురూరల్: భారతదేశంలో అటవీ సంరక్షణకు స్పష్టమైన ప్రణాళిక రూపొందించిన బ్రిటీష్ అధికారుల్లో ఉడ్స్‌కు ఎంతో పేరొంది. నల్లమల అటవీ ప్రాంతంలో ఉడ్స్ పేరు వింటే బైర్లూటీ సమీపంలో నాగలూటి రేంజ్‌లో ఉన్న టేక్ ప్లాంటేషన్, బైర్లూటీ సమీపంలో మొదలై పసురుట్ల రుద్రకోడు మీదుగా వేంపెంట వరకు ఉన్న అతి పొడవైన ఉడ్స్ ఫైర్‌లైన్‌లు గుర్తుకొస్తాయి. అడవిలో వేసవిలో సంభవించే అగ్ని ప్రమాదాల నివారణకు ఆయన ఫైర్‌లైన్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఆయన సేవలను గుర్తిస్తూ ఆత్మకూరు అటవీ డివిజన్‌లో ఏర్పాటైన బైర్లూటీ జంగిల్ సఫారీలో ఆయనకు పెద్ద పీట వేశారు. నాగలూటిలోని ఉడ్స్ టేక్ ప్లాంటేషన్ వద్ద ఆయన పేరుతో పెద్ద ఫలకాన్ని ఏర్పాటు చేశారు. బ్రిటీష్ జాతీయుడైన హ్యూగో ఫ్రాన్సిస్ అండ్రూ ఉడ్ 1890లో ఇంపీరియల్ ఫారెస్ట్ సర్వీస్‌లో చేరారు. ఆయన తన వృత్తి శిక్షణను కూపర్ పర్వతాల్లో ఉన్న రాయల్ ఇండియన్ ఇంజినీరింగ్ కాలేజీలో పూర్తి చేసుకున్నారు. 1893 నుంచి ఆయన ఉద్యోగ విరమణ చేసిన 1926 వరకు అప్పటి బ్రిటీష్ ఇండియాలోని మద్రాస్ ప్రసిడెన్సీలోనే పని చేశారు. తన విధుల్లో భాగంగా అప్పటి గోదావరి, కర్నూలు, దక్షిణ కోయంబత్తూరు అటవీ డివిజన్ అభివృద్ధికి ఎంతో కృషి చేసిన ఆయనకు తమిళనాడు ప్రభుత్వం హాల్ ఆఫ్ ఫేమ్ ఫారెస్ట్ కన్జర్వేటర్స్‌లో స్థానం కల్పించింది.

అడవికి రక్షణ కంచె వేసి.. చెంచులకు ఉపాధి చూపి..

ప్రస్తుతం నల్లమలలో ఉన్న బేస్ క్యాంప్ పద్ధతిలో ప్రొటెక్షన్ వాచర్లుగా చెంచులను నియమించే పద్ధతికి ఓ రకంగా ఉడ్స్‌ను ఆద్యుడుగా చెప్పుకోవచ్చు. చేతిలో విల్లంబులతో తిరిగే చెంచులు తమ విధులకు అటంకంగా పరిణమిస్తారని ఊహించిన ఉడ్స్ చెంచులకు ఉపాధి కల్పించేలా ఆత్మకూరు అవీ డివిజన్‌లో పలు టేకు ప్లాంటేషన్లను నాటించారు. వాటిలో 1906లో నాగలూటి రేంజ్‌లో ఏర్పాటు చేసిన ఉడ్స్ ప్లాంటేషన్ పీఏ పురం బీట్‌లోని కొలిమిచెర్వు టేకు ప్లాంటేషన్, పంగిడి టేకు ప్లాంటేషన్‌లు ముఖ్యమైనవి. నల్లమల అడవులకు టేకును పరిచయం చేసిన ఘనత ఉడ్స్‌దే. ఆయన 63వ ఏట 1933 డిసెంబర్ 12న మరణించగా, ఆయన సేవలకు గుర్తుగా ఆయన తొలుత ప్లాంటేషన్స్ వేసిన అన్నామలై అటవీ ప్రాంతంలోని ఒక ప్లాంటేషన్‌లో సమాధి చేశారు. ఆయన సమాధిని తమిళనాడు ప్రభుత్వం ఒక దర్శనీయ స్థలంగా అభివృద్ధి చేసింది.



1906లో ఉడ్స్ నాటించిన నాగలూటి టేకు ప్లాంటేషన్

అడవికి ఎంతో మేలు చేశారు



మేం చిన్నప్పటి నుంచి చూస్తున్న నల్లమల అడవుల్లో ఉడ్స్ దొర చేసిన కృషి కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది. ఆత్మకూరు అటవీ డివిజన్‌లోని కొలిమి చెర్వు టేకు ప్లాంటేషన్, నాగలూటిలోని భారీ టేకు వనం ఉడ్స్ దొర చేసిన కృషికి నిదర్శనాలు. అంతే కాకుండా మేమంతా వేంపెంట లైన్‌గా చెప్పుకునే ఉడ్స్ ఫైర్ లైన్, అలాగే సిమ్స్ దొర పేరిట ఉన్న స్విమ్స్ ఫైర్ లైన్‌లు బ్రిటీష్ అధికారుల నిబద్ధతకు కొలమానాలుగా నిలుస్తాయి.

– సుధాకర్‌రెడ్డి, ఏజీపీ, ఆత్మకూరు

మాకు వారే స్ఫూర్తి



పూర్వం నల్లమలలో అటవీ సంరక్షణకు ఉడ్స్, సిమ్స్ లాంటి బ్రిటీష్ అధికారులు చేసిన కృషియే మాలాంటి యువ అధికారులకు స్ఫూర్తిదాయకంగా ఉంటోంది. ఆనాటి ఫైర్ లైన్‌లు, ప్లాంటేషన్‌లు ఇప్పటికీ ఉన్నాయి. వారిని ఆదర్శంగా తీసుకుని అటవీ సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నాం. – బేగం, ఎఫ్ఎస్ఓ, నాగలూటి రేంజ్

క్లుప్తంగా

యోగాలో వరల్డ్ రికార్డు



సుభాకర్ రాజుతో పాటు తల్లిదండ్రులను సన్మానిస్తున్న వాసవీ, వనితా క్లబ్ సభ్యులు

బేతంచెర్ల: పట్టణానికి చెందిన సుభాకర్ రాజు అనే యువకుడు యోగాలో వరల్డ్ రికార్డు సాధించారు. గత నెల 23వ తేదీన హైదారాబాద్ నగరంలో 1.40 గంటల పాటు ఏకదాటిగా నీటిలో పద్మాసనం వేసి వరల్డ్ రికార్డు సాధించారు. ఈ నెల 24వ తేదీన సుభాకర్ రాజుకు వరల్డ్ రికార్డు మెడల్ సర్టిఫికెట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం బేతంచెర్ల వాసవీ క్లబ్ అధ్యక్షుడు సూర్య బళ్లాని, ఆర్య వైశ్యులు కందగడ్డల మోహన్ రావు, సుబ్రమణ్యం, రాజు ఆధ్వర్యంలో యువకుడు సుభాకర్ రాజుతో పాటు తల్లిదండ్రులను దుశ్శాలువ, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

ఏపీఎఫ్ఎస్ఎంఏ నూతన కమిటీ ఎన్నిక



నూతన కార్యవర్గసభ్యులు

కర్నూలు(హాస్పిటల్): ఏపీ ఫార్మా సేల్స్ మేనేజర్స్ అసోసియేషన్ (ఏపీఎఫ్ఎస్ఎంఏ) జిల్లా నూతన కమిటీ ఎన్నికైంది. ఆదివారం అసోసియేషన్ 17వ సార్వత్రిక సర్వసభ్య సమావేశం గాంధీనగర్‌లోని కార్యాలయంలో నిర్వహించారు. సమావేశంలో ఫార్మాకంపెనీల విషయాలు, కార్మికుల హక్కుల గురించి జాతీయ ఉపాధ్యక్షులు జి. రామయ్య ప్రస్తావించారు. అనంతరం ఎన్నిక నిర్వహించారు. నూతన అధ్యక్షులుగా బండారు దస్తగిరి యాదవ్, ఉపాధ్యక్షులుగా గోపాలయ్యశెట్టి, కార్యదర్శిగా కె. రామకృష్ణ, ఉప కార్యదర్శిగా వై. రామాంజులురెడ్డి, కోశాధికారిగా శ్రీరామ్పుల్లయ్య, ఉపకోశాధికారిగా నాగరాజశేఖర్ ఎన్నికయ్యారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు ప్రారంభం



మార్చ్ ఫాస్ట్ చేస్తున్న కర్నూలు రగ్బీ క్రీడాకారులు

కర్నూలు (టౌన్): కర్నూలు నగర శివారులోని ఆదర్శ విద్యా సంస్థల క్రీడా మైదానంలో 66 వ రాష్ట్ర స్థాయి అండర్–17 బాలబాలికల రగ్బీ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. 13 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు అతిథులకు గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఆదర్శ విద్యా సంస్థల అధినేత తిమ్మయ్య మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో పోటీల అబ్జర్వర్ వినయ్‌కుమార్, ఏడీ శ్యామ్యూల్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి లక్ష్మయ్య, పీడీలు వెంకటేశ్వర్లు, విజయ్‌కుమార్, బాషా తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధికి కళ్లెం!

- యేటేటా తగ్గుతున్న కేసులు
- ఇంటింటా తిరిగి రోగుల వివరాలు సేకరిస్తున్న ఆరోగ్య కార్యకర్తలు
- ఉచితంగా మందులు, ఉపకరణాల పంపిణీ
- నేడు జాతీయ కుష్టువ్యాధి వ్యతిరేక దినోత్సవం



స్పర్శ కార్యక్రమానికి సంబంధించి కరపత్రాలు, పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

కర్నూలు(హాస్పిటల్): కుష్టువ్యాధిగ్రస్తులను చూస్తే ఆమడదూరం ఉండటం, వారిని ఊరికి దూరంగా ఉంచడం వంటి రోజులు పోయాయి. వారితో కలిసి జీవించినా ఏమీ కాదని అధికారులు చాటి చెబుతున్నారు. ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకు జాతిపిత మహాత్మా గాంధీ ఆత్మత్యాగాన్ని చాటారని, కొందరు రోగులను ఆయన స్వయంగా తన ఆశ్రమంలో ఉంచుకుని సపర్యలు చేసి ఆదర్శంగా నిలిచారని గుర్తు చేస్తున్నారు. అందుకే ఆయన మరణించిన రోజైన జనవరి 30వ తేదీన జాతీయ కుష్టు వ్యాధి వ్యతిరేక దినంగా నిర్వహిస్తారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. ఇందులోని సబ్‌సెంటర్లు,విజేల్ హెల్త్ క్లినిక్స్‌లలో గత నవంబర్ 15 నుంచి జనవరి 15వ తేదీ వరకు ఇంటింటికీ ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు తిరిగి కుష్టువ్యాధిగ్రస్తులను గుర్తించారు. ఈ మేరకు జిల్లాలో 1700 బృందాలు పనిచేసి 23,49,233 మందికి గాను 22,44,615(95.6శాతం) మందిని సర్వే చేశాయి. కొత్తగా 2,893 మందికి కుష్టు వ్యాధిలక్షణాలు కనిపించగా వారికి డీపీఎంవో, మెడికల్ ఆఫీసర్, హెల్త్‌సూపర్‌వైజర్లు పరీక్షించారు. వీరిలో కేవలం 63 మందికి మాత్రం కొత్తగా వ్యాధి ఉన్నట్లు నిర్ధారించారు. దీంతో పాత, కొత్త కేసులు కలిపి ఈ ఏడాది 149 మంది చికిత్సపొందుతున్నారు. వ్యాధినిర్ధారణ అయిన తర్వాత బాధితున్ని పీహెచ్‌సీల్లోని మెడికల్ ఆఫీసర్ పరిశీలించి చికిత్స అందిస్తారు. కుష్టురోగులను చేర్చుకుని చికిత్స అందించేందుకు గాను కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ప్రత్యేకమైన వార్డును ఏర్పాటు చేశారు. ఇందులో ఒక మెడికల్ ఆఫీసర్, ఒక ల్యాబ్‌టెక్నీషియన్, ఫిజియోథెరపిస్ట్, డీపీఎంవోలు పనిచేస్తారు. దీంతో పాటు నందికొట్కూరు రోడ్డులోని మరియా నిలయంలో అనాథలైన కుష్టు వ్యాధిగ్రస్తులకు చికిత్స అందిస్తున్నారు.

మందులు ఉచితం

జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో బహుళ ఔషధ చికిత్స(మల్టీడ్రగ్ థెరపీ) ద్వారా కుష్టు వ్యాధికి మందులు పూర్తిగా ఉచితంగా అందజేస్తున్నారు. వైద్యునిచే వ్యాధినిర్ధారణ అయిన తర్వాత మొదటి నెల వైద్యుని వద్ద, రెండో నెల నుంచి ఏఎన్ఎం ద్వారా ఇంటి వద్దే మందులు తీసుకోవచ్చు. వైద్యులు సూచించిన మేర నిర్ణీతకాలానికి మందులు క్రమం తప్పకుండా వాడాల్సి ఉంటుంది.



ఇంటింటికి తిరిగి ప్రజలను పరీక్షిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

జిల్లాలో తగ్గుతున్న కేసులు

జిల్లాలో గత ఐదేళ్లలో ప్రతి సంవత్సరం కుష్టురోగుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. కేసులను గుర్తించే కార్యక్రమం ముమ్మరంగా జరుగుతుండటం, గుర్తించిన వారికి ఆరు నెలల పాటు ఎండీటీ చికిత్సను అందించి కోలుకునేటట్లు చేస్తున్నారు. ఫలితంగా 2018–19లో 531 మందికి, 2019–20లో 506 మందికి, 2020–2021లో 136 మందికి, 2021–22లో 191 మందికి, 2022–23లో ఇప్పటి వరకు 137 మందికి కుష్టువ్యాధికి సోకినట్లు అధికారులు నిర్ధారించారు. వ్యాధినిర్ధారణ, చికిత్సకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల కారణంగా కొత్త కేసుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. వెలుగులోకి వచ్చిన కేసుల్లో ముందుగా పురుషులు, తర్వాత స్త్రీలు, అనంతరం చిన్నపిల్లల సంఖ్య అధికంగా ఉంటోంది. వ్యాధిసోకి అంగవైకల్యం చెందిన 450 మందికి గత ఏడాది రబ్బరు చెప్పులు, 206 మందికి ఉపకరణాలు పంపిణీ చేశారు.

వ్యాధి లక్షణాలు ఇవీ..

- ఈ వ్యాధి మైకో బ్యాక్టీరియా లెప్రి అను బ్యాక్టీరియా వల్ల వస్తుంది.
- రోగి తుమ్మడం, దగ్గడం వల్ల ఇతరులకు వ్యాప్తి చెందుతుంది.
- వ్యాధి లక్షణాలు కనిపించేందుకు మూడు నుంచి ఐదేళ్లు పడుతుంది.
- స్పర్శలేని మచ్చలు, ముఖం, చెవులు, ఛాతి, వీపుపై నొప్పిలేని బుడిపెలు, కాళ్లు, చేతుల్లో తిమ్మిర్లు, వాపులు ఉండటం, ముక్కుదూలం అణిగిపోయి గాలి ఆడకపోవడం, బొటనవేలు, చిటికెనవేలు, మణికట్లు పనిచేయకపోవడం, కాలి వేళ్లనేలకు రాసుకోవడం, పాదాలు, చేతులపై బొబ్బలు రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

నేటి నుంచి స్పర్శ కార్యక్రమాలు



జిల్లాలో ఈ నెల 30వ తేదీ నుంచి వచ్చే నెల 13వ తేదీ వరకు 15 రోజుల పాటు స్పర్శ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. అన్ని గ్రామ పంచాయతీల్లో, వార్డు సచివాలయాల్లో కుష్టువ్యాధిపై ఎంఎల్‌హెచ్‌పీ/ఏఎన్ఎం, ఆశ, అంగన్‌వాడీ వర్కర్లు, ఉపాధ్యాయులచే గ్రామసభలు నిర్వహిస్తాం. ఈ సభల్లో కుష్టువ్యాధిపై అవగాహన, ఎండీటీ ఉచిత చికిత్స గురించి వివరిస్తారు. కొత్త కేసులను గుర్తించడం, వారికి వెంటనే చికిత్స ప్రారంభించడం, వారి పట్ల వివక్ష, చిన్నచూపు చూడకుండా చేయడం, వారిలో అంగవైకల్యాన్ని తగ్గించడం, కొత్త కేసుల సంఖ్యను తగ్గించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశాలు. వ్యాధి లక్షణాలు కనిపించిన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి చికిత్స తీసుకుంటే వ్యాధితప్పక నయం అవుతుంది.

–డాక్టర్ ఎల్.భాస్కర్, అడిషనల్ డీఎంహెచ్‌వో(ఎయిడ్స్ అండ్ లెప్రసీ), కర్నూలు

శ్రీమఠంలో కర్ణాటక మాజీ సీఎం కుమారస్వామి



పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులతో ముచ్చటిస్తున్న కుమారస్వామి దంపతులు

మంత్రాలయం: శ్రీరాఘవేంద్రస్వామి దర్శనార్థం కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి, ఆయన సతీమణి అనిత కుమారస్వామి ఆదివారం మంత్రాలయం వచ్చారు. మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మఠం మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ముందుగా వారు గ్రామ దేవత మంచాలమ్మకు అర్చన సహిత హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్రుల మూలబృందావనానికి ప్రత్యేక పూజలు చేసుకుని హారతులు పట్టారు. ఈ సందర్భంగా పీఠాధిపతి దంపతులను శేషవస్త్రం, తలపాగా, రాఘవేంద్రుల జ్ఞాపిక, ఫల పూల మంత్రాక్షింతలతో ఆశీర్వదించారు. కాసేపు యోగక్షేమాలపై ముచ్చటించి పుర వీధుల్లో పర్యటించారు. అన్నపూర్ణ భజనశాల, పరిమళ ప్రసాద శాలను వీక్షించారు. గోపురం, అభయాంజనేయస్వామి విగ్రహం సందర్శించి జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించారు.

రెండో రోజుల్లో గృహ ప్రవేశం.. అంతలోనే విషాదం

- విద్యుదాఘాతంతో ఇంటి యజమాని మృత్యువాత



మాల నరసప్ప (ఫైల్)



భర్త నరసప్ప మృతదేహంపై పడి రోదిస్తున్న భార్య నరసమ్మ

ఎమ్మిగనూరురూరల్: సొంతింటి కల నెరవేరుతుందని ఆ కుటుంబమంతా సంబరపడుతున్న వేళ విధి ఆ ఇంట విషాదాన్ని నింపింది. మరో రెండు రోజుల్లో బంధుమిత్రులతో కలసి నూతన గృహ ప్రవేశం చేయాలనుకున్న వ్యక్తి అదే ఇంటిలో మృత్యువాత పడటంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటన బనవాసి గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మాల నరసప్ప (45) ఓ చిన్న రైతు. భార్య నరసమ్మ, కుమారుడు విజయ్, కుమార్తె నందిని ఉన్నారు. ఇటీవల ఇంటి నిర్మాణం చేపట్టి గృహ ప్రవేశానికి సిద్ధమయ్యాడు. గ్రామంలో ఫిబ్రవరి 3న విగ్రహ ప్రతిష్ట, మారెమ్మ దేవరలు ఉండటంతో అంతకు ముందే నూతన గృహ ప్రవేశం చేసి కొత్త ఇంట్లో పండగ జరుపుకోవాలనుకున్నాడు. మరో రెండు రోజుల్లో గృహ ప్రవేశం ఉండటంతో బంధుమిత్రులందరికీ సమాచారం ఇచ్చాడు. ఇంటి పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఇంతలోనే విషాదం అలుముకుంది. ఆదివారం ఇంటికి విద్యుత్ వైరింగ్ ఇవ్వగా నరసప్ప ఇంట్లోకి వెళ్లి స్విచ్ బోర్డు వద్ద ప్లగ్ లేకుండా వైర్లు పెడుతుండగా ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురయ్యాడు. కేకలు విన్న కుటుంబీకులు అక్కడికి చేరుకుని విద్యుత్ తీగలను కర్రతో పక్కకు నెట్టేశారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను 108లో ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. కాగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. భర్త మృతదేహంపై నరసమ్మ రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

మాతృభాషను కాపాడుకుందాం

- పేరడీ కవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు



జొన్నవిత్తులను సన్మానిస్తున్న సదస్సు నిర్వాహకులు

కర్నూలు కల్చరల్: మాతృభాషను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదీ అని పేరడీ కవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు అన్నారు. సాహితీ సదస్సు ఆధ్వర్యంలో ఆదివారం కేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'జై తెలుగు'అనే అంశంపై సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జొన్నవిత్తుల మాట్లాడుతూ తెలుగు భాష ఇంటా బయట వాడదగిందన్నారు. మాతృభాషను మరిచిపోతే మనల్ని మనమే మర్చిపోయినట్టేనన్నారు. తెలుగును వ్యవహారిక భాషగా వెలుగులోకి తెచ్చింది గిడుగు రామ్మూర్తి పంతులు అన్నారు. వేమన సాహిత్యాన్ని వెలుగులోకి తెచ్చింది సీపీ బ్రౌన్ అన్నారు. ఇలాంటి మహనీయుల జీవిత చరిత్రలను తెలుసుకోవాలన్నారు. సాహితీ సదస్సు అధ్యక్షులు కురాడి చంద్రశేఖర కల్కూర అధ్యక్షతన జరిగిన సదస్సులో శతావధాని గండ్లూరి దత్తాత్రేయ శర్మ, తానా పూర్వ అధ్యక్షులు డాక్టర్ ప్రసాద్ తోట కూర, తెలుగు బాషా వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్ఆర్కే శర్మ మాట్లాడారు. సదస్సుకు రచయిత్రి దండబోయిన పార్వతీ దేవి సమన్వయ కర్తగా వ్యవహరించారు. అంతకు ముందు జొన్నవిత్తులు ఆలపించిన పేరడీ పాటలు నవ్వులు పూయించాయి. కార్యక్రమంలో సాహితీ వేత్తలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదోనిలో ముస్లిం మతగురువుల సమ్మేళనం



మతగురువులను సన్మానిస్తున్న ముస్లిం మత పెద్దలు

ఆదోని రూరల్ : ఆదోని పట్టణంలోని తాహెర్‌షా ఖాద్రి దర్గాలో దర్గా పీఠాధిపతి సయ్యద్‌మహ్మద్‌ఖాద్రి అధ్యక్షతన ఆదివారం మతగురువుల సమ్మేళన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల్లోని వివిధ దర్గాలకు చెందిన పీఠాధిపతులు, గురువులు పాల్గొన్నారు. కర్నూలు లతీఫ్‌లావుబాలి దర్గాపీఠాధిపతి సయ్యద్‌హసీం ఆరిఫ్‌పాషాఖాద్రికి గురువులకు గురువు టైటిల్‌ను అందజేశారు. సయ్యద్‌హుసేని పీర్ ఖాద్రి, కర్ణాటక ప్రభుత్వ రిటైర్డ్ అడిషనల్ సెక్రటరీ సయ్యద్ ఎజాజ్‌అమ్మద్ ఖాద్రితోపాటు పలువురు ప్రముఖులు, మత గురువులు, ముస్లిలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఎస్ఐ శంకర్‌నాయక్ సస్పెన్షన్



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బనగానపల్లె: చిన్నరాజు పాలెంకు చెందిన వ్యక్తి ఆత్మహత్య ఘటనకు సంబంధించి బనగానపల్లె ఎస్ఐ శంకర్ నాయక్‌పై సస్పెన్షన్ వేటు పడింది. గ్రామంలో ఇరువర్గాలు అప్పు విషయంలో వాగ్వాదపడి పరస్పరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. ఈ మేరకు ఎస్ఐ శంకర్ నాయక్ శనివారం సాయంత్రం ఓ వర్గానికి చెందిన తల్లీ కుమారుడు కుమ్మరి గురమ్మ, దస్తగిరిని స్టేషన్‌కు పిలిపించి విచారించి ఇంటికి పంపారు. కొద్ది సేపటి తర్వాత తల్లీకొడుకు స్టేషన్ ఎదుట పురుగు మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడగా, దస్తగిరి మృతి చెందాడు. ఈ విషయంపై నంద్యాల ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆదివారం ఉదయం బనగానపల్లె స్టేషన్‌కు చేరుకుని విచారణ చేపట్టారు. చిన్నరాజుపాలెం గ్రామానికి చెందిన కుమ్మరి గురమ్మ, కుమ్మరి దస్తగిరిల పట్ల ఎస్ఐ శంకర్‌నాయక్ అసభ్యకరంగా మాట్లాడినట్లు దర్యాప్తులో తేలడంతో ఎస్ఐను సస్పెండ్ చేశామని ఎస్పీ పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలని దస్తగిరి కుటుంబీకులు ఉదయం స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. దీంతో గంట పాటు ట్రాఫిక్ గంట పాటు నిలిచి పోయింది. సీఐలు సుబ్బరాయుడు, నారాయణరెడ్డి, ప్రియతంరెడ్డి, మరికొందరు ఎస్ఐలు, పోలీసులు ఆందోళనకారులకు నచ్చజెప్పి ఆందోళన విరమించారు.

ఆకతాయిల నుంచి విద్యార్థినులకు పోలీస్ రక్ష

- సేఫ్ సిటీ పోలీసులను అభినందించిన ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

కర్నూలు: వైఎస్సార్ జిల్లా పులివెందులకు వెళ్లేందుకు అర్ధరాత్రి రోడ్డుపై బస్సు కోసం వేచి ఉన్న మెడిసిన్ విద్యార్థినులను ఆకతాయిల బారి నుంచి సేఫ్ సిటీ పోలీసులు కాపాడారు. వారిని సురక్షితంగా బస్టాండుకు చేర్చారు. కర్నూలు మెడికల్ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు శనివారం అర్ధరాత్రి పులివెందులకు వెళ్లేందుకు ప్రభుత్వాసుపత్రి ముందు (ఎన్టీఆర్ సర్కిల్) వద్ద బస్సు కోసం వేచి ఉన్నారు. రెండో సినిమాకు వెళ్లిన కొంతమంది పోకిరీలు (ఆకతాయిలు) మెడిసిన్ విద్యార్థినులను చూసి ఈవ్‌టీజింగ్ పాల్పడుతుండగా రాత్రి గస్తీ విధులను పరిశీలించేందుకు అటుగా వెళ్తున్న మూడో పట్టణ సీఐ తబ్రేజ్ గమనించారు. తక్షణమే స్పందించి వారిని బస్సులో ఎక్కించి బస్టాండుకు సురక్షితంగా చేర్చాలని సేఫ్ సిటీ విధుల్లో భాగంగా గస్తీ తిరుగుతున్న కానిస్టేబుల్ చెంచన్న, హోంగార్డు షేక్షావలిని ఆదేశించారు. సేఫ్ సిటీ పోలీసులు వారికి భద్రత కల్పించడంతో పాటు ఎటువంటి సమస్యలు లేకుండా ఎన్టీఆర్ సర్కిల్ నుంచి వారిని బస్సు ఎక్కించి బస్టాండుకు సురక్షితంగా చేర్చారు. ఇదే విషయాన్ని ఎస్పీ సిద్ధార్థ కౌశల్ దృష్టికి తీసుకెళ్లగా గస్తీ పోలీసులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. మహిళల భద్రతకు ప్రత్యేక చర్య లు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని అత్యవసర పరిస్థితుల్లో దిశ యాప్ ద్వారా సమస్యను తెలియజేయాలని ఎస్పీ మహిళలకు విజ్ఞప్తి చేశారు.

సమస్యలుంటే కర్నూలు వెబ్‌సైట్‌కు తెలియజేయవచ్చు..

ఎక్కడైనా సమస్యలుంటే కర్నూలు పోలీస్ వెబ్‌సైట్‌లో కర్నూలు సేఫ్ సిటీ http/kurnoolpolice.in/safecity/ లింక్‌ను క్లిక్ చేసి సమస్యను తెలియజేయవచ్చు. కర్నూలు నగరాన్ని సేఫ్ సిటీగా మార్చేందుకు ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ మూడు నెల క్రితం ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందించారు. నగరంలో గస్తీ తిరిగేందుకు దాదాపు 22 వాహనాలను సిబ్బందికి సమకూర్చారు. నగరంలో గస్తీని పటిష్టంగా మార్చేందుకు డీఎస్పీ స్థాయి అధికారికి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. 24గంటలు అందుబాటులో ఉండి స్పందిస్తూ ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందిస్తున్నామని ఎస్పీ పేర్కొన్నారు.

మల్చింగ్‌తో అనేక ఉపయోగాలు

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ, ఉద్యాన పంటల్లో మల్చింగ్‌తో అనేక ఉపయోగాలు ఉన్నాయని బనవాసి కృషి విజ్ఞానకేంద్రం ముఖ్య శాస్త్రవేత్త, కో–ఆర్డినేటర్ పి.సుజాతమ్మ అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో దేశీ డిప్లొమా కోర్సుపై ఇన్‌పుట్ డీలర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమకంలో ఆమె మాట్లాడుతూ.. ఉద్యాన పంటల్లో మల్చింగ్ వినియోగానికి ఉద్యానశాఖ సబ్సిడీలు ఇస్తోందన్నారు. మల్చింగ్‌తో నేలలో తేమ ఎక్కువ రోజులు నిల్వ ఉంటుందని, కలుపు సమస్యలను అధిగమించవచ్చని తెలిపారు. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేసేందుకు బిందు, తుంపర్ల సేద్యం సదుపాయాలను సద్వినియోగం చేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో దేశీ శిక్షణ కార్యక్రమం సమన్వయ కర్త, విశ్రాంత డీడీఏ నాగేంద్రయ్య, జిల్లా వనరుల కేంద్రం ఏవో శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

కర్నూలు కల్చరల్: కర్నూలు మండలం గార్గేయపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల(1982–83 బ్యాచ్) ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కర్నూలు నగర శివారులోని శ్రీనివాసగార్డెన్స్‌లో జరిగింది. నాలుగు దశాబ్దాల తరువాత వారందరూ కుటుంబ సభ్యులతో సహా హాజరయ్యారు. చదువుకున్న రోజులను గుర్తు చేసుకుంటూ ఆహ్లాదంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పి ఉన్నతంగా తీర్చిదిద్దిన గురువులు జయరామయ్య, రామచంద్రారెడ్డి , చంద్రశేఖర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రాముడు, కరుణాకర్‌రావు, ఎల్లారెడ్డిలను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు ప్రభాకర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటరామిరెడ్డి, రమేష్, అపోలో నీల్ ఆనంద్‌కుమార్, దివాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహ సంబంధాలు



కరాటే పోటీలను ప్రారంభిస్తున్న రామాంజనేయులు

కర్నూలు (టౌన్): క్రీడలతో స్నేహ సంబంధాలు పెరుగుతాయని రాష్ట్ర ఒలింపిక్ సంఘం కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు అన్నారు. ఆదివారం కర్నూలు శివారులోని కమ్మ సంఘం సమావేశ హాలులో అంతర్‌రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏదో క్రీడలో తప్పనిసరిగా సాధన చేయాలన్నారు. క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బనగానపల్లె నెమ్రూ స్కూల్ డైరెక్టర్ రవి, భారత కరాటే ఫెడరేషన్ సంయుక్త కార్యదర్శి కోలా ప్రతాప్, జిల్లా కరాటే అసోసియేషన్ ప్రతినిధులు ఆరిఫ్, ఫయాజ్ అహ్మద్, ఇంద్ర, విజయ్ పాల్గొన్నారు.

పుణ్యస్నానాలకొచ్చి.. పరలోకాలకు

- పెన్నానదిలో నీట మునిగి ఇద్దరు భక్తులు మృతి

పెద్దపప్పూరు: అనంతపురం జిల్లా పెన్నానదిలో పుణ్యస్నానాలు ఆచరించడానికి వెళ్లిన ఇద్దరు భక్తులు లోతట్టు ప్రాంతంలో నీట మునిగి ప్రాణాలు విడిచారు. మృతుల్లో ఒకరు కర్నూలు జిల్లా, మరొకరు కర్ణాటక ప్రాంత వాసి. ఈ ఘటనలతో రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది. పెద్దపప్పూరులో అశ్వత్థ నారాయణస్వామి తిరుణాళ్లు జరుగుతున్నాయి. కర్నూలు జిల్లా ప్యాపిలి మండలం రాచర్లకు చెందిన వెంకటనారాయణ (30), కర్ణాటక రాష్ట్రం కొల్హాపూర్ జిల్లాకు చెందిన శ్రీనాథ్ (20) ఆదివారం తిరునాళ్లకు వచ్చారు. స్థానిక పెన్నానదిలో పుణ్యస్నానాల కోసం వెళ్లారు. ఈత రాని శ్రీనాథ్ లోతట్టు ప్రాంతంలో నీట మునిగి ఊపిరాడక చనిపోయాడు. వెంకటనారాయణ నీటిలో చిక్కుకుని అపస్మారకస్థితికి చేరుకున్నాడు. అతడిని వెంటనే స్థానికులు 108 అంబులెన్స్‌లో తాడిపత్రి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వెంకటనారాయణ మృతిచెందాడు.



తాడిపత్రి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన వెంకటనారాయణ